సినిమా సంబరం

హన్మంతుకు థ్రిల్లింగా ఉంది.

థ్రిల్లింగంటే అంతా ఇంతాగాదు- ఆడుక్కుతినే వాడికి అమరలోక సుఖం లభించబోతున్నంత.

ఏకంగా సూపర్ స్టారై సినీరంగాన్ని ఏకఛత్రాధిపతిగా ఏలుతున్నంత అనుభూతి.

అగ్రశ్రేణి సినీ తారల జీవిత చరిత్రలెన్నో ఆసక్తిగా చదివి.... విశ్లేషించి చూశాడంతకు ముందే. విశ్లేషణలో తేలిందేమిటంటే- ఎక్స్ట్రాగా ఫీల్డులో చేరిన ఆడారి విధవ ప్రకతి నిచ్చెన మెట్టు ఒక్కొక్కటే ఎక్కి తారాపథాన్నందుకో గలుగుతాడు. అగ్రశేణి తారలలో అలాంటి వారిదే మెజారిటీట. అందుకే అంత ఇదీను. హీరో వద్ద పెర్సనల్ ఆసిస్టెంటుగా చేరిన అమాయకుడు కాలం కలసిరాగానే హీరోగా మారిపోగలడు. స్టూడియో ముందు బటానీలమ్ముకున్న భద్రయ్య సినీ నిర్మాతగా అవతారమెత్తిన దాఖలాలున్నాయి.

అలాంటిది.... తనగ్గాడా అలాంటి శుక్రమహర్దశ రాదనే అనుమాన మెందుకూ? చెప్పొచ్చే దేమిటంటే- హన్మంతుకంత మంచి అలోచన వచ్చినందుకు.... సరాసరి థ్రిల్లింగ్ దూసుకొచ్చింది. అదీ అల్లాటప్పాగా రాలేదు.

నిన్నంటే....నిన్ననే ఓ సినిమా దర్శకుడు వాళ్ళ కాలేజీ కొచ్చాడు. వచ్చిన వాడల్లా విద్యార్థుల మొహమైనా చూడకుండా నేరుగా ప్రిన్స్‌పాల్ గదిలో జొరబడ్డం- అందరికీ ఆశ్చర్యమే సింది. కాస్సేపట్లో ఆశ్చర్యం ఆనందంగా మారింది.

ప్రిన్స్‌పాల్ తమ క్లాసురూంలోకొచ్చి సినిమా డైరెక్టర్ పార్థసారధిగారు తీస్తున్న సినిమాలో 'ఒక దృశ్యంలో మీక్లాసు లోని కొందరు నటించాలని అడుగుతున్నారు. సంస్కృతం ఆప్ష నల్ విద్యార్థులంతా ఓసారి లేచినుల్చోండి.' అన్నాడు నశ్యం ఖర్చుచేస్తూ.

'ఎప్పుడు సార్?' అహల్య అడిగింది కమ్మగా....తనగ్గూడా అవకాశమిస్తే బావుండు ననుకుని.

'విద్యార్థులు మాత్రమే....విద్యార్థినులు కాదమ్మా! గురుకు లాశ్రమంలో బ్రహ్మచారులు వేద మంత్రాలు వల్లె వేస్తున్న దృశ్యంట.'

'బై దిబై బ్రహ్మచారిణుల దృశ్యం గూడా చిత్రీకరిస్తే ఆకర్షణీయంగా ఉంటుంది గదా!' మండోదరి ఉచిత సలహా.

పచ్చిమిరపకాయ పరపర నమిలినంత పనైంది. ప్రిన్సి పాల్‌కు.

'పిచ్చిపిచ్చి సలహాల కోసం కాదాయన వచ్చింది. నువ్ కూచో.'

మండోదరి ముఖారవిందం మాడిపోయిన వంకాయైంది.

హన్మంతుడిగూడా సంస్కృతం ఆప్షనలే కాబట్టి లేచి నిల్చు న్నాడు. ఆతన్తోపాటు మరో ఎనమండుగురు.... మొత్తం తొమ్మిది.

కళ్ళతోనే లెఖ్క వేసి.

"ఈ నవగ్రహాలు సరిపోతారా?" అడిగాడు ప్రిన్స్‌పాల్ పక్కనే ఉన్న డైరెక్టర్ను, చాలని తలూపాడాయన.

'మరి డైరెక్టర్ గారితో వెళ్ళండని' హుకుం జారీచేసి జారు కున్నాడు ప్రిన్స్‌పాల్.

తొమ్మండుగురిని వేరేగదిలోకి తీసికెళ్ళాడు డైరెక్టర్ పార్థ సారథి.

'మీరు.... రేపు ఉదయం తొమ్మిదికిక్కడే ఉండండి. మా వ్యాన్ వచ్చి మిమ్మల్ని స్టూడియోకు తీసుకెల్తుంది.' అనగానే.

'మేమెంత సేపు నటించాల్సుంటుంది సార్?'

'మా పాత్రలేమిటి సార్?'

'మా ముందు గురువు పాత్ర ఉంటుందా?'

'స్టూడియోలో మాకన్నీ చూపిస్తారా?

సినిమా పేరేమిటి సార్?'

'హీరో హీరోయిన్లెవరండీ?'....

తలా ఓప్రశ్న వడ్డించారు తొమ్మండురు.

'మీరైతే రెడీగా ఉండండి. ఆ విషయాలన్నీ తెలుసుకుం టారు.' అని చరచరా వెళ్ళిపోయాడాయన.

ఐతేనేం.. ఎంచక్కా తను సినీఫీల్డులో అడుగు పెట్టబోతు న్నాడు. దొరికిన చాన్సు చిన్నదైనా అద్భుతంగా నటించి అం దరి దృష్టి నాకట్టుకుంటే ఇంకో సినిమాలో కొంచెం పెద్దపాత్ర ఇస్తారు. అందులో గూడా బాగానటిస్తే సైడ్ హీరో చాన్సు తగ లొచ్చు ....మరో సినిమాలో. అందులో తన కళాకౌశలాన్నంతా

ఉపయోగించి అత్యద్భుతంగా నటిస్తే కొన్ని సినిమాలలో హీరోగా కన్పించవచ్చు. హీరోగా గెంతిన మొదటి సినిమా హిట్టయితే ఎందరో నిర్మాతలు తనింటి ముందు క్యూలో నిల్చుంటారు.

సంవత్సరం తిరిగేలోగా మూడంతస్తులమేడ.... ముద్ద బంతి పూవంటి హీరోయిన్‌తో పెళ్ళి.... ఇంకేముంది? జీవితమంతా నందనవన విహారమే. థ్రిల్లింగ్ ..థ్రిల్లింగ్ .. థ్రిల్లింగ్.

స్టూడియోలా కెళ్ళగానే ఫ్లోర్లన్నీ చూడాలనీ, షూటింగ్‌లో పాల్గొన్న తారలతో కులాసాగా కబుర్లు చెప్పుకోవాలనీ.... చెవులు కొరుకున్నారు, నవగ్రహాలు వ్యాన్‌లో.

కాలేజీ వార్షికోత్సవాలలో, ఇతర ఫంక్షన్స్‌లో నాటకాలేసి ప్రేక్షకుల వేళ్ళు ముక్కులమీద వాలేలా చేసిన హన్మంతునే తమ లీడర్‌గా ఎంచుకున్నారు కాబోయే అగ్రతారలు.

వ్యాన్ డైరెక్టుగా పరుగెత్తి మేకప్ గది ముందాగింది. లోపలికెళ్ళారు బెరుకు బెరుగ్గా.

'మా డైరెక్టర్‌గారు చెప్పిన కాలేజీ స్టూడెంట్స్ మీరేనా..?' అడిగాడొకాయన ఎదురొచ్చినంతే పంజేసి.

'ఔనండీ మేమే ఈరోజు షూటింగుందన్నారు, మీరూ.... మీరు' అందరి కంటే ముందున్న హన్మంతు గుండె ఐబ్‌డబ్ మంటున్నా.... నాలిక తడారిపోతున్నా ఖాతరు చెయ్యకుండా అడిగేశాడు.

'నేను అసిస్టెంటు డైరెక్టర్ను. కమాన్.. మీరు త్వరగా మేకప్‌కండి.' అని మేకప్‌మాన్‌కు పరిచయం చేసి మాయమయ్యాడాయన.

'ఇదేమిట్రా?....టీ, కాఫీలేవీ ఇవ్వరా?' రామ్మూర్తి నీరు
గారి పోతున్నాడు.

'నటులంటే....వీళ్ళకసలు గౌరవమే లేనట్టుందే!' దేవదాసు
సణుగుడు.

స్టూడియో కెళ్ళగానే ఇంటల్లుడిలా మర్యాదలందుకోవచ్చ
నుకున్న హన్మంతు నరాల్లో నిరాశ కుతకుతలాడినా....ఆశమాత్రం
చావలేదు.

'అబ్బా....కాస్సేపాగండిరా తిండి పోతుల్లారా! ఎవరన్నా
చూస్తే మనం తిండికోసమే వచ్చామనుకుంటారు. ఐనా.... టై
మెంతైందనీ! అప్పారావ్ తొమ్మిదిన్నరే గదా! స్టూడియోలో టిఫిన్
టైం పదికొచ్చు నోమ్మూసుకోండి కాస్సేపు.' అన్నాడు బింకంగా

'రండయ్యా బాబులూ! మేకప్ చెయ్యాలి. ముందు మీరు
శుభ్రంగా మొహాలు కడుక్కురండి!' పురమాయించాడు అసి
స్టెంట్ మేకప్‌మాన్. అతని సొమ్మేదో అరిగిపోతున్నట్టు– అతని
మాటలలో ఏకోశానా మర్యాదా, మన్ననలు కనబడలేదు. వినబడ
లేదు.

మొహాలు కడుక్కురాగానే మేకప్ ప్రారంభమైంది.

ముగ్గురు నలుగురున్నారు మేకప్ చేసేందుకు. నవగ్రహాల
మొహాలకు రంగులు వేస్తున్నారు... కాదు... లెంపలు వాయిస్తు
న్నారు. అరచేతులకు రంగులు పూసుకుని లటలటలాడిస్తుంటే
చెంపలుబ్బి పూర్ణంబోరెలై పోతున్నాయి.

'అబ్బా! ఇదేమిటండీ....మేకప్ చెయ్యడమంటే ఇంతగట్టి
గా బాదడమా?' భరించలేకపోయాడు హన్మంతు.

తాగుతున్న బీడీకి కాస్త విశ్రాంతి నిచ్చి.

'ఇది సినిమా మేకప్పా, మజాకా? వేషానికి తగిన ఎఫెక్ట్ మేకప్‌తోనే రావాలాయె. లేకపోతే మా మేకప్‌మాన్ మాలెంపలు పచ్చడి చేసి పూరీలలో నంజుకు తింటాడు' మరికాస్త వేగం పెంచాడాయన.

మొహంమీద, మెడలు-భుజాలమీద రంగుచేతులు పట్టిస్తున్నాయి. మేకప్పయ్యే సరికి గోడగడియారం పన్నెండుసార్లు ఆవలించింది. ఆత్మారాముని గోల అధికమైంది. పొద్దట్నుంచి పచ్చి మంచి నీళ్ళైనా వాడికి సమర్పించుకోనందుకు వీరవిహారం చేస్తున్నాడు. ఆకలిపందికొక్కు పేగుల్ని కొరుక్కు తింటుంది.

బోడిగుండు మధ్యలో పిలక....బిళ్ళగోచిధోవతి....నుదురు' భుజాలు, చేతులు, చాతీలమీద విభూతిరేఖలు ..., పెడుమూతులు

మూడు నిముషాల భాగోతానికి మూతిమీసాలూడినాయన్నే సామెత గుర్తు కొచ్చినా బయటి కనబుద్ధి కాలేదు.

'ఆశ్రమ విద్యార్థుల మేకప్ బాగా కుదిరిందోయ్!' గురువుగా నటిస్తున్న సైడ్‌హీరో మెప్పుకోలుకు- ఎవ్వరికీ మేకప్ చెయ్యని అసిస్టెంట్ మేకప్‌మాన్ తల కృతజ్ఞతా భారంతో వలాడింది.

నవగ్రహాల నరాలు ఆకలి స్వరాలు నినదిస్తున్నాయి.

'ఇంతకీ అసలు మేకప్‌మాన్ ఎక్కడండీ?' తనకు చివరి మెరుగులు దిద్దుతున్న మనిషినడిగాడు హన్మంతు-ఎంత వద్దనుకున్నా తోసుకొస్తున్న కోపాన్నణచుకోలేక.

'అసలు మేకప్‌మానంటే అల్లాటప్పా మనిషనుకున్నారా?

ఆయన హీరో-హీరోయన్ల మేకప్ మాత్రమే చూస్తుంటారు. ఇదో .... మేమంతాలేమా మీలాంటి ఎక్స్‌ట్రాగాళ్ళకు సింగారిం చేందుకు?'

మనసు చివుక్కుమన్నా పెదాలమీద బలవంతపు చిరునవ్వు మెరిసింది.

'మేకప్ ఇంత బాగా కుదిరినా వీళ్ళ మొహమ్మీద. కళనే లేదేమిటోయ్?' ఆసిస్టెంటు మేకప్‌మాన్ భృకుటి ముడిపడింది.

'పొద్దట్నుంచి కడుపులో కనీసం కాఫీనీళ్ళన్నా పడందే మొహమ్మీద కళ ఎక్కడుంటుందండీ? అసలే నీరసంతో మేం చస్తుంటే...' గుర్రుమందొక గ్రహం.

'ఆరెరె! మీరు... కాఫీ....టిఫిన్లు లేకుండానే మేకప్ రూం లో కొచ్చారా?' అంటూ అంగలేసూ వెళ్ళి అసిస్టెంటు డైరెక్టర్ను లాక్కొచ్చాడు-అసిస్టెంటు మేకప్‌మాన్.

'ఏమయ్యా బాబులూ! కనీసం కాఫీ-టిఫిన్లు కాకుండానే ఇంటినుండి బయల్దేరారా?'

అలా అడిగిన అసిస్టెంట్ డైరెక్టర్ గొంతు పిసికెయ్యాల న్పించింది. సహనంకు ఒళ్ళు మండిపోతుంది- వేడిపొయ్యి మీది రొట్టెపెంకలా.

'అంతపొద్దునే మాకోసం ప్రత్యేకంగా తయారుచేసి .... కాఫీ టిఫిన్లిచ్చి పంపిస్తారా.... మా అమ్మానాన్నలు? ఐనా.... ఇంత పెద్ద సినిమా తీస్తున్నారు.... ఎంతో మంది పరిశ్రమలో పంజేస్తున్నారు. వందలాది నటులు పాల్గొంటున్నారు. వారంతా ఇంటివద్దే టిఫిన్లూ, భోజనాలు వేసొస్తున్నారా?' ఝాడించాడు

హన్మంతు కుడిభుజం భీమేశ్వర్.

'ముందు ముందు పై కిరావాలనుకున్న తన భవిష్యత్తు గతేమౌతుందోనని ఓపక్క హడలిపోతున్నాడు హన్మంతు కాని ...కడుపులో ఏదన్నా పడందే నిలదొక్కుకోవడం అసాధ్యమని పించి గమ్మునూరుకున్నాడు

అరగంటలో కాఫీ-టిఫిన్లొచ్చాయి-మేకప్ రూంకే. వాటి పని పట్టింతర్వాత అసిస్టెంటు డైరెక్టర్ చిత్రీకరించబోయే సన్ని వేశం గురించి వివరించాడు.

ఒక సంస్కృత శ్లోకాన్ని గురువుగారు చెబుతూంటే తొమ్మండుగురు శిష్యులు అనుసరించాలి. గురువుగారు శ్లోకం, అర్థతాత్పర్యం వివరిస్తుండగా ఒక రాజభటుడొచ్చి గురువుగార్ని తీసికెళ్తాడు-రాజుగారతణ్ణి వెంటనే రమ్మన్నారని.

'ఐతే.... మేం చెప్పాల్సిన డైలాగులేమీ లేవాసార్?' ఉసూరు మంది హన్మంతు ఆత్మవిశ్వాసం.

'గురువుగారి శ్లోకాన్ని మీరనుసరించడం తప్ప ఇంకేమీ లేదు. ఇది సరిగా చేసిన వారికి....తర్వాత తీసే సినిమాలో డైలాగులున్న పాత్రలిచ్చే అవకాశముంది.'

హన్మంతులో ఆశారేఖ తొంగిచూచింది.

ఎవరెవరు ఎక్కడెక్కడ కూచోవాలో రిహర్సల్ చేయించి చూపించాడు అసిస్టెంటు డైరెక్టర్. అందరికంటే ముందు హన్మంతునే కూచోమ్మన్నాడు. అందుకు తబ్బిబ్బైపోయింది హన్మంతు ఆత్మవిశ్వాసం.

'నేనొచ్చి మిమ్మల్ని తీసికెళ్తాను. అప్పటిదాకా ఇక్కడే

ఉండండి.' అని హడావుడిగా పరుగెత్తాడాయన.

బయటేదో షూటింగు నడుస్తుంది. అదన్నా చూస్తే బావుం డనిపించింది. కాని ఎవరినడిగి వెళ్ళాలో తెలీక కిటికీల్లోంచి చూ స్తుండి పోయారు.

షూటింగ్ చూస్తూ ఆమాటా ఈమాటా మాట్లాడు కుంటుంటే మధ్యాహ్నం రెండున్నరైంది.

'ఆకలేస్తుందిరా హన్మంతూ! వాళ్ళంతా భోజనాలు చేసిన ట్టుంది. మనసెవ్వడూ పిలువలేదేమిట్రా.... మనకు మేకప్ చేసిన వాళ్ళుగూడా వెళ్ళిపోయారప్పుడే....'రామ్మూర్తి గొంతు గురగుర లాడింది.

'ఎందుకొచ్చిన బాధరా ఇదంతా! వెళ్ళిపోదాం పదండి!' రోషం పొడుచు కొచ్చింది దేవదాసుకు.

హన్మంతుగ్గూడా కోపం రాక పోలేదు....కాని తన భవిష్య త్తు గుర్తుకొచ్చే సరికి చప్పున చల్లారింది.

'కాస్సేపాగండిరా! ఇంత సేపున్నాం. ఇంకాస్సేపుంటే షూటింగై పోతుంది. అప్పుడు వెళాం. అవకాశమనేది మనల్ని వెతుక్కుంటూ రాదు. దాన్నే మనం వెతుక్కుంటూ వెళ్ళాలి. జీవి తంలో చిన్నపాటి అవకాశం దొరికింది. సినిమాలో మనం కన్పిం చేది మూడునిముషాలే ఐనా మూడుకోట్ల మందైనా చూస్తారు మనల్ని, దీన్నే ఆసరాగా తీసుకుని పైకిపోయే ప్రయత్నం చేద్దాం.' మందలింపులో వేడుకోలుంది.

'భవిష్యత్తు లేదు, పిండాకూడు లేదు. నేను వెళ్తారా!' మేక ప్పు విప్పుకో బోయిన రామ్మూర్తిని మరింత ప్రతిమి లాడాల్సొ

చ్చింది.

మూడున్నరకు వచ్చి తీసికెళ్ళాడు అసిస్టెంటు డైరెక్టర్-షూటింగ్ స్పాట్‌కు.

* * *

ఆరోజే 'రాణిగారి రంకుమొగుడు' సినిమా విడుదల.

మొదటిరోజు....మొదటి ఆట చూసి తీరాలనే ఉబలాటంతో థియేటర్ కెళ్ళాడు హన్మంతు. డైరెక్ట్‌గా మానేజర్ గదిలోకెళ్ళి స్టయిల్‌గా కూచున్నాడు. 'రాణిగారి రంకుమొగుడు' సినిమాలో తాను నటించినట్టు అంతకు ముందే చెప్పించాడు మానేజర్తో.

స్నేహితులు, బంధుజలగం ప్రచారంతో ఊరంతా చాటింపువేసినట్టయింది.

'మనూరి వర్థమాన నటుడు హన్మంతు నటించిన అద్భుత చిత్రం' అని ప్రచారం చేశారు థియేటర్ వాళ్ళు. స్వయంకృషితో సినిమా రంగంలో ప్రవేశించాడని ఆకాశాని కెత్తేశారు బాల్య స్నేహితులు.

'హైద్రాబాదులో చదువుకుంటే ఇలాంటి అవకాశాలొస్తాయి. అదే మన టౌన్లో చదువుకుంటే నాకీ అవకాశం దొరికేది కాదన్నాడు వారితో.

హన్మంతు వెంట మిత్రమండలి గూడా ఉంది-హన్మంతుని వెంట కోతిమూకలా.

కట్టుడు పళ్ళికిలించి సగౌరవంగా ఆహ్వానించాడు థియేటర్ మానేజర్. కూల్‌డ్రింక్స్ పరుగెత్తుకొచ్చాయి. ప్రేక్షకులతో క్రిక్కిరిసిన హాల్లో ప్రత్యేక సీట్లు ఏర్పాటైనాయి.

'అదో ఆయనే హన్మంతంటే-ఈ సినిమాలో నటించాడట.'

'అబ్బో....ఈయనా. అదృష్టవంతుడే! ఏ అదృష్టవంతురాలు ఎగరేసుకుపోతుందో ఆతణ్ని.'

చెవులు కొరుక్కుంటున్న ఆడపిల్లల మాటలు హన్మంతు గుండెలలో గిలిగింత పెట్టాయి.

సినిమా ప్రారంభమైంది. హన్మంతు నటించిన సన్నివేశం ఎప్పుడొస్తుందాని ఒళ్ళంతా కళ్ళుజేసుకు చూస్తున్నారంతా. ఆదృశ్యం కనబడగానే చల్లేందుకు తెచ్చిన పూలు హన్మంతు దండు చేతులలో మురిసిపోతున్నాయి. గంటన్నర దాకా ఆ సన్నివేశం రాలేదు. ఇంటర్వెల్లో అడిగాడు థియేటర్ మానేజర్.

'కథలో ఏ సందర్భంలో మీ ప్రాత అంటే.... మీరు కనిపిస్తారు సార్!' అని.

అసలా సినిమా కథేమిటో.... కథలో గురుశిష్యుల దృశ్యమెందుకు చూపిస్తున్నారో హన్మంతుకు తెలీదు. తెలుసు కోవాలనే అడిగాడు షూటింగ్ రోజున అసిస్టెంటు మానేజర్ను.

'అదంతా నీకుందుకయ్యా? సినిమా రిలీజ్ కాగానే చూడండి. మీకే అర్థమైపోతుంది.' మొహం చిట్లించాడాయన.

'మిగితా హాఫ్‌లో కనబడతానండీ' అనూరుకున్నాడు.

సినిమా ఐపోయింది. అందులో హన్మంతు నామరూపాలేవీ కనబడలేదు-వినబడలేదు

'వీడేదో కూస్తే మనం నమ్మి వెధవలమై పోయాం.' అన్నాడొక మిత్రుడు.

'ఫ్రీగా సినిమా చూడాలంటే ఇంత పెద్ద అబద్ధమాడాలా?'

గుడ్లురిమాడు థియేటర్ యజమాని.

ఏడుపు కళ్ళదాకా వచ్చి ఆగిపోయినట్టనిపించిఁది హన్మం తుకు. అవమానాన్ని భరించలేక.

'నిజంగా నేనిందులో నటించాా.' అనబోయి ఆగిపో యాడు ఎవరూ నమ్మేట్టులేరని.

'సంగతేమిటి?' అని ఫోన్ చేశాడు నవగ్రహాల్లో ఒక గ్రహ మైన రామ్మూర్తికి.

'సినిమా నిడివి ఎక్కువైందని కొన్ని పనికిరాని ఘట్టాల్ని కత్తిరించారట. మనం నటించిన సీనుగూడా అబాపద్దేనట.' రామ్మూర్తి సమాధానం హన్మంతు ఆంతరాళాల్లో గందరగోళం సృష్టించింది.

జాగృతి (19-25 నవంబర్ 1990)